నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | మే 04, 2024 | www.navatelangana.com

ప్రారంభమైన హోం ఓటింగ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్‌పై దృష్టి సారించిన ఎన్నికల కమిషన్ తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పించింది. శుక్రవారం నుంచి మే 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా హోం ఓటింగ్ జరగనుంది. అయితే ఆదిలాబాద్ నియోజకవర్గంలో హోం ఓటింగ్ కోసం 485 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి పోలింగ్ సిబ్బంది ఇంటికి వెళ్లి ఓటు హక్కు వినియోగించే అవకాశం కల్పించారు. శుక్ర, శనివారాల్లో ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని, మిగిలిన వారుంటే 6న మళ్లీ హోం ఓటింగ్‌కు అవకాశం ఇస్తామని ఆర్డీఓ వినోద్ కుమార్ తెలిపారు.



నాయకుల చేరిక తాత్కాలికంగా నిలిపివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్ గాంధీభవన్‌లో ఇటీవల మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవరెడ్డి కాంగ్రెస్‌లో చేరికను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, చేరికల కమిటీ సభ్యుడు జగ్గారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనివార్య కారణాలు, ఏఐసీసీ ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మతోన్మాద బీజేపీ పార్టీని ఓడించాలి

- డీవైఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడిసెల కార్తీక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మతోన్మాద బీజేపీని ఓడించి, భారత రాజ్యాంగాన్ని, యువత భవిష్యత్తును కాపాడాలని డీవైఎఫ్‌ఐ (భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య) రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. శుక్రవారం డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని యువత ఓట్లతో గద్దెనెక్కిన నరేంద్ర మోడీ ఎలాంటి ఉపాధి-ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా యువతను మోసం చేశాడని అన్నారు. అలాంటి మోడీ మళ్లీ 400పైగా ఎంపీ స్థానాలు గెలిచి రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు లేకుండా చేసి సమస్త దేశ సంపదను అంబానీ, ఆదానీలకు తాకట్టు పెట్టడానికి సమాయత్తం అవుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే భారత దేశ అభివృద్ధిని కాంక్షిస్తూ యువత ఆలోచించి మోడీ ప్రభుత్వానికి గద్దె దించడమే మొదటి లక్ష్యంగా ఉద్యమించాలని పేర్కొన్నారు. అగ్నిపథ్ లాంటివి తీసుకొచ్చి దేశ భద్రతను ప్రమాదంలో నెట్టడమే కాకుండా, దేశ సేవ చేయాలనుకునే యువత ఆశలపై నీళ్లు చల్లారని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో రైతులకు, కార్మికులకు, యువతకు, మహిళలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలను తీవ్రంగా పెంచిందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై భారాలు మోపిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా మోసం చేసిందని, జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా 10 సంవత్సరాల పాలనలో ప్రభుత్వ నూతన పరిశ్రమలు మంజూరు చేయలేదని తెలిపారు. ఇండియా కూటమిలో భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో డివైఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు దుర్గం రాజ్‌కుమార్, గెడం టికనంద్, జిల్లా నాయకులు తుమ్రం ఈశ్వర్, కొట్నక పవన్ పాల్గొన్నారు.

డీఎల్ఎస్ఏ కార్యదర్శిగా సౌజన్య బాధ్యతలు



ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నూతన సెక్రెటరీగా బోనగిరి సౌజన్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి గంగారం, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అరుగుల అశోక్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ ఉమేష్‌రావు, మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన క్షమాదేశ్‌పాండే హన్మకొండకు బదిలీ కాగా బోనగిరి సౌజన్య హైదరాబాద్ నుంచి బదిలీపై వచ్చారు.

విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి



నస్పూర్ : వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్లో జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, విద్యాశాఖ సమన్వయకర్త సత్యనారాయణమూర్తితో కలిసి రూమ్ టు రీడ్ సంస్థ వారు అందిస్తున్న డయల్ అండ్ లిసన్ ఏ స్టోరీ సంబంధిత వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని, అందుబాటులో ఉన్న వివిధ రకాల మాధ్యమాలు, కౌశలాలను అభివృద్ధి చేసుకోవడానికి ఉపయోగించుకొని వచ్చే విద్యా సంవత్సరానికి విశ్వాసంతో సిద్ధం కావాలని తెలిపారు. రూమ్ టు రీడ్ సంస్థ వారు అందిస్తున్న డయల్ అండ్ లిసన్ ఏ స్టోరీలో 040-45209722 నంబర్‌కు డయల్ చేసి ఐవిఆర్ సదుపాయం ద్వారా ప్రతి రోజు ఒక చక్కటి కథ వినవచ్చని, తద్వారా శ్రవణ, ఆలోచన నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ మధు, సభ్యులు పాల్గొన్నారు.


ఉమా మహేశ్వరి కళాశాలను వేరొక చోటికి తరలించొద్దు

నస్పూర్: ఉమా మహేశ్వరి కళాశాలను వేరొక చోటికి తరలించకూడదని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం మంచిర్యాల ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి శైలజకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య విద్యా సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని లక్షెట్టిపేట్‌లో గల ఉమా మహేశ్వరి ఇంటర్మీడియట్ కళాశాలలో యాజమాన్యం ప్రభుత్వ నిబంధన తుంగలో తొక్కి ఇష్టానుసారంగా హైదరాబాద్‌కు తరలించడం జరుగుతోందని, దాని ద్వారా అందులో చదువుకున్నటువంటి విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షల్లో, సర్టిఫికెట్ల విషయంలో ఎక్కడికి వెళ్లాలో అర్థం కాని పరిస్థితిలో చదువులకు దూరమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. కళాశాలను తరలించకుండా చూడాలని, లేనిపక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల అధ్వర్యంలో భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఇందల్ రాథోడ్, అనపర్తి యువరాజ్, జుమ్మిడి గోపాల్, జాగిరి రాజేష్, చేరాల వంశీ, బచ్చలి ప్రవీణ్ కుమార్, మేకల శ్రీను, బచ్చల అభిరామ్, సామల శివతేజ, సంతోష్ పాల్గొన్నారు.

ఒకే రోజు..ఇద్దరు అగ్రనేతలు..!



- రేపు నిర్మల్‌కు రాహుల్‌గాంధీ..కాగజ్‌నగర్‌కు అమిత్‌షా రాక
- అగ్ర నేతల రాకతో కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల్లో ఆసక్తి
- ఆదిలాబాద్ లోక్‌సభ సీటుపైనే ప్రధాన పార్టీల దృష్టి
- ఇప్పటికే ఆదిలాబాద్, ఆసిఫాబాద్ సభలకు సీఎం హాజరు
- రసవత్తరంగా మారుతున్న లోక్‌సభ సమరం



ఒకే రోజు ఇద్దరు అగ్రనేతలు ఉమ్మడి జిల్లాకు రానున్నారు. పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీలు ప్రచారపర్వాన్ని మరింత ముమ్మరం చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఆయా పార్టీలకు చెందిన కీలక నాయకులు అభ్యర్థుల తరపున ప్రచారం కోసం జిల్లాకు వరుస కడుతున్నారు. తాజాగా ఈ నెల 5వ తేదీన ఒకే రోజు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన అగ్రనేతలు రావడం ఆసక్తి రేపుతోంది. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోకి వచ్చే నిర్మల్‌లో కాంగ్రెస్ నిర్వహించే భారీ బహిరంగ సభకు రాహుల్‌గాంధీ హాజరుకానుండగా.. కాగజ్‌నగర్‌లో బీజేపీ నిర్వహించనున్న బహిరంగ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరుకావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కిందటి అసెంబ్లీ ఎన్నికల్లోనూ నిర్మల్ జిల్లాలో ఒకే రోజున అమిత్‌షాతో పాటు అప్పటి సీఎం కేసీఆర్ హాజరైన సందర్భాలున్నాయి. తాజాగా లోక్‌సభ ఎన్నికల్లోనూ అలాంటి పరిస్థితి ఎదురుకానుంది. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ఇద్దరు అగ్రనేతల పర్యటనతో ఆదిలాబాద్ లోక్‌సభ సమరం మరింత రసవత్తరంగా మారుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు వ్యూహ రచన చేస్తున్నాయి. ఇప్పటికే ప్రచార పర్వంలో దూకుడు పెంచిన పార్టీలు అగ్రనేతలను రప్పించేందుకు ఏర్పాట్లు చేశాయి. జనాన్ని ఆకట్టుకొని ఓట్లు రాబట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతుండటం ఆసక్తికరంగా మారుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీలు గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండగా.. బీఆర్ఎస్ సైతం విజయంపై నమ్మకంతో ప్రజల్లోకి వెళ్తోంది. ఇటీవలే ఆ పార్టీలకు చెందిన రాష్ట్ర స్థాయి కీలక నాయకులు ఆదిలాబాద్ లోక్‌సభ పరిధి చేపట్టిన సభలు, ప్రచారానికి హాజరై శ్రేణుల్లో ఉత్సాహం నింపగా.. తాజాగా జాతీయ స్థాయి నేతలను రప్పించి ప్రజలను మరింత తమవైపు తిప్పుకోవాలని భావిస్తున్నాయి. పోలింగ్‌కు మరో ఎనిమిది రోజులు మాత్రమే సమయం ఉండటంతో అగ్రనేతల ప్రచారానికి ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఇందులో భాగంగానే ఈ నెల 5వ తేదీన కాంగ్రెస్ నిర్వహించనున్న జనజాతర సభకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి పార్టీ నేతలు స్థల పరిశీలన కూడా పూర్తిచేసినట్లు చెబుతున్నారు. మరోపక్క కాగజ్‌నగర్‌లో బీజేపీ నిర్వహించే బహిరంగ సభకు ఆ పార్టీ అగ్రనేత అమిత్‌షా హాజరుకానుండటం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతోంది. ఇది వరకే కాంగ్రెస్ అభ్యర్థి తరపున ప్రచారానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌లో నిర్వహించిన సభల్లో పాల్గొని పార్టీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మరోపక్క బీఆర్ఎస్ అభ్యర్థి తరపున నామినేషన్ల కంటే ముందు ఆదిలాబాద్‌లో నిర్వహించిన పార్లమెంటు నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి కేటీఆర్ హాజరుకాగా.. ఆ తర్వాత బహిరంగ సభ వంటివి ఆ పార్టీ నిర్వహించలేదు. రాష్ట్రంలో కేసీఆర్ బస్సు యాత్ర చేపడుతున్నా ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో మాత్రం పర్యటన ఖరారు కావడం లేదు. కేసీఆర్ రాకపై ఆ పార్టీ శ్రేణుల్లోనూ స్పష్టత రావడం లేదు.

దక్కించుకోవడమే లక్ష్యంగా..!

ఆదిలాబాద్ లోక్‌సభ సీటును కైవసం చేసుకోవాలని ప్రధాన పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయి. ఎవరికి వారు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం బీజేపీ చేతిలో ఉన్న ఈ సిట్టింగ్ స్థానాన్ని చేజిక్కించుకోవాలని కాంగ్రెస్ భావిస్తుండగా.. మరోసారి విజయం సాధించి తిరిగి నిలబెట్టుకోవాలని బీజేపీ అనుకుంటోంది. లోక్‌సభ స్థానంలో గెలిచి పట్టు సాధించాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

ఇలా ప్రధాన పార్టీలన్ని ఈ సీటుపై కన్నేయడం, ప్రచారానికి అగ్రనేతలు వరుసకట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీలు ఈ సీటును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో నువ్వానేనా అనే రీతిలో దూకుడుగా వ్యవహరించడం మరింత చర్చకు దారితీస్తోంది. ఇప్పటికే లోక్‌సభ పరిధిలో రెండు భారీ సభలతో జనాల్లోకి వెళ్లిన కాంగ్రెస్, నిర్మల్ సభతో మరింత దూకుడుగా వెళ్లాలని భావిస్తోంది. బీజేపీ సైతం అమిత్‌షా సభతో జనాలను తమవైపు తిప్పుకోవాలని ఆరాటపడుతోంది. బీఆర్ఎస్ సైతం బహిరంగ సభ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

బీజేపీని ఓడించడమే సీపీఐ(ఎం) లక్ష్యం

- ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు
- పార్టీ రాష్ట్ర నాయకుడు జె.వెంకటేష్
- మద్దతుపై కృతజ్ఞతలు తెలిపిన సుగుణక్క

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా సీపీఐ(ఎం) కృతనిశ్చయంతో పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్ అన్నారు. బీజేపీని ఓడించడానికి ఇండియా కూటమిలో భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఎన్నికల్లో సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని చెప్పారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి డి.మల్లేష్ అధ్యక్షతన నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పదేండ్ల బీజేపీ పాలనలో దేశానికి ఒరిగిందేమీలేదని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు కొలువులు, కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడంతో విఫలమైందని, ఎలాంటి అభివృద్ధి చేయలేదని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో సీసీఐ పరిశ్రమ తెరిపించలేదని, కొత్త పరిశ్రమలను నెలకొల్పలేదని తెలిపారు. మత కలహాలు, కుల కొట్లాటలు తప్ప బీజేపీకి చేసిందేమీ లేదని పేర్కొన్నారు. ఈ పదేండ్ల పాలన వీటి చుట్టే తిరిగిందని విమర్శించారు. మోడీ చెబుతున్న సబ్‌కా వికాస్ ఎక్కడా కనిపించడం లేదని, ఇప్పటికీ 5లక్షల గ్రామాలకు తాగునీటి సరఫరా లేదని గుర్తు చేశారు. అటవీ హక్కుల చట్టంతో గిరిజనులు బతకలేని పరిస్థితి తీసుకొచ్చిందని



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

తెలిపారు. తెలంగాణలో ఎలాంటి అభివృద్ధి చేయని బీజేపీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే బీజేపీకి వివిధ రాష్ట్రాల్లో ఓటింగ్‌శాతం తగ్గిపోయిందని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. దేశంలో 400సీట్లు కాదు కదా..కనీసం సగం సీట్లు కూడా ఆ పార్టీకి రావని పేర్కొన్నారు. వామపక్షాలు బలపడటం ప్రజాస్వామ్యానికి రక్ష అని, రానున్న పార్లమెంటు ఎన్నికలో రెండు అంకెల స్థానాలు గెలిచి లోక్‌సభలో అడుగుపెడుతామని ధీమా వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆత్రం సుగుణ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూనే ఆదివాసులు, ప్రజల హక్కుల కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. అనేక కేసులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇలాంటి ఉద్యమ నాయకురాలిని గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలకు ఉందని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో ఆత్రం సుగుణకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు.

సీపీఐ(ఎం)కు ఆత్రం సుగుణ కృతజ్ఞతలు

లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ(ఎం) మద్దతు ప్రకటించడం పట్ల ఆత్రం సుగుణ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సీపీఐ(ఎం) నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ఇది వరకు తాను కమ్యూనిస్టు ఉద్యమాల్లోనే పనిచేసినట్లు గుర్తు చేశారు. సెక్యూలర్ పార్టీ అయిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో సీపీఐ(ఎం) మద్దతు ప్రకటించడం ఆనందంగా ఉందని తెలిపారు. బీజేపీ వంటి అరాచక పార్టీలను ఎదిరించడానికి కలిసి పోరాడుదామని పిలుపునిచ్చారు. బీజేపీకి ఓటు వేస్తే బతుకులు ఆగమవుతాయని, ప్రజలు ఈ దిశగా ఆలోచన చేసి కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు, సీనియర్ నాయకుడు లంక రాఘవులు, బండి దత్తాత్రి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శులు సంకె రవి, కూశన రాజన్న, నిర్మల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి లంక జమున, నాయకులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్ తదితరులు పాల్గొన్నారు.



వడ్డీ వ్యాపారుల ఆగడాలు

నవతెలంగాణ-బేల



మండలంలోని వడ్డీ వ్యాపారుల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వడ్డీ వ్యాపారం చేస్తున్న కొందరు వ్యాపారులు వారి వద్ద నుండి అప్పు తీసుకున్న సామాన్య, పేద ప్రజల అవసరాలు(కూతుళ్ల పెళ్లిళ్లు, ఆరోగ్య సమస్యలు) ఆసరా చేసుకుని ఇష్టారీతిన వడ్డీ వసూలు చేస్తూ సామాన్య ప్రజల రక్తాన్ని జలగల్లా తాగుతున్నారు. వీర వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా నడుస్తోంది. వారి వద్దకు వచ్చే జనాల అవసరాలే వీరికి లాభాలను తెచ్చి పెడుతున్నాయి. రుణ గ్రహీతల అవసరాన్ని ముందుగానే పసిగట్టిన వడ్డీ వ్యాపారాలు వారికి సంబంధించిన ప్లాట్స్, భూములు, ఇతర స్థిరాస్తులను ముందే వారి పేరున రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. రిజిస్ట్రేషన్ చేసి ఉండడం వల్ల అధిక వడ్డీ నిర్ణయించి ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. వడ్డీ వ్యాపారి మోసాన్ని ఓ బాధిత రైతు నవతెలంగాణతో గోడు వెళ్లబోసుకున్నాడు. రూ.5లక్షలకు సంవత్సరంలోనే ఏడున్నర లక్షలు కట్టానని, రూ.2.50లక్షలు కేవలం వడ్డీ రూపంలో కట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. లక్ష రూపాయలు తీసుకుంటే ముందుగా ఆ లక్షకు జూన్ నుండి డిసెంబర్ వరకు 25శాతం వడ్డీని వసూలు చేస్తారు. జనవరి నుండి మే వరకు 5 నుండి 10 శాతం వరకు వారి ఇష్టారీతిన వడ్డీ వసూలు చేస్తున్నారు. వ్యాపారి నుండి 5లక్షలు తీసుకున్న రైతుకు సంవత్సరంలోనే తిరిగి చెల్లించే నాటికి రూ.7.50లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. రెండున్నర లక్షలను వడ్డీ రూపంలోనే తీసుకుంటున్నారు. మండలంలో వ్యాపారం చేస్తున్న వ్యాపారులకు ఏ ఒక్కరి వద్ద కూడా ప్రభుత్వం నుండి లైసెన్స్‌లు లేవు. కానీ వందల సంఖ్యల్లో వారి వద్ద ప్రామిసరీ నోట్లు, రైతుల వద్ద నుండి రిజిస్ట్రేషన్ చేసుకున్న భూములు, ప్లాట్స్‌కు సంబంధించిన పత్రాలు మాత్రం ఉంటాయి. పర్యవేక్షణ చేయాల్సిన సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. రైతులు వడ్డీ వ్యాపారులకు తిరిగి అప్పు చెల్లించే సమయంలో వడ్డీ ఎక్కువగా వేశారు, కొంచం వడ్డీని తగ్గించాలని ఎంతగా వేడుకున్నా వ్యాపారులు మాత్రం ససేమీరా అంటున్నారు. మీ ఇష్టం కడితే కట్టండి లేకపోతే లేదు, ఎటువంటి ఇబ్బంది లేదు అంటూ పేర్కొంటున్నారు. మీ ప్రాపర్టీ తమ వద్ద రిజిస్ట్రేషన్ చేసి ఉందని దబాయిస్తూ బెదిరింపులకు సైతం పాల్పడుతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు సామాన్యులను వడ్డీ వ్యాపారుల మాఫియా నుండి రక్షించాలని పలువురు కోరుతున్నారు.

ఆత్రం సక్కును గెలిపించాలి : మాజీ మంత్రి రామన్న

నవతెలంగాణ-ముధోల్

ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం ముధోల్‌లో ముధోల్, బాసర కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి గడపగడపకు వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారికి అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీలు, రూ.2లక్షల రుణమాఫీ అని చెప్పి ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఆగస్టులో రుణమాఫీ చేస్తానని చెబుతున్నాడని తెలిపారు. అది కూడా ఉత్తమాటేనని తెలిపారు. అప్పటి వరకు సర్పంచ్, ఎంపిటిసిల ఎన్నికలు కూడా అయిపోతాయని, ఎన్నికల కొరకే రుణమాఫీ అంటున్నాడని ఆరోపించాడు. కాంగ్రెస్, బిజెపికి పదవి కోసం ఆరాటమే తప్ప సంక్షేమం గురించి పట్టించుకోవని తెలిపారు. బీఆర్ఎస్ అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో లబ్ది పొందిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వేరే పార్టీలకు పోయారని, కారు గుర్తుకు ఓటు వేసి వారికి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. తమను ఆదరించి గెలిపిస్తే నియోజకవర్గంతో పాటు చదువుల తల్లి బాసర ఆలయం అభివృద్ధికి పాటుపడుతానని పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ముందుటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జడ్పి చైర్మన్ జనార్దన్ రాథోడ్, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు విలాస్ గాదేవార్, రమాదేవి, డా.కిరణ్ కోమరెవార్, లోలం శ్యాంసుందర్, ఎంపీటీసీ గంగాధర్, రాజారెడ్డి, కె.విఠల్, తునుకు హన్మండ్లు, నూకం రామరావు, అశోక్, ముధోల్, బాసర మండలాల బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధన భినందనీయం

నస్పూర్ : 10వ తరగతి వార్షిక ఫలితాలలో ఉత్తమమైన ఫలితాలు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో 10వ తరగతి వార్షిక పరీక్షా ఫలితాలలో 10 జిపిఏ సాధించిన తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, ప్రిన్సిపల్ రజినితో కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక ఫలితాలలో తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు హనిస్వి, రిశిత్ యాదవ్ 10 జీపిఏ సాధించారని, అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ ప్రభుత్వ పాఠశాలలు ప్రజలలో నమ్మకం కలుగజేస్తున్నాయని తెలిపారు. ఈ ఫలితాల సాధనకు అధ్యాపక బృందం చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవతెలంగాణ-ఇచ్చోడ

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఎల్లమ్మగూడ గ్రామానికి చెందిన షేక్ మాలిక్(18) బంధువుల పెళ్లి ఉందని తన ద్విచక్ర వాహనంపై గురువారం మధ్యాహ్నం ఇచ్చోడకు బయలుదేరాడు. మార్గమధ్యలో మేడిగూడ గ్రామ సమీపంలో రోడ్డుపై ఎదురుగా ఇచ్చోడవైపు నుండి వేగంగా వస్తున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొంది. దీంతో మాలిక్ కాళ్లు, చేతులు, తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుండి నిజామాబాద్‌లోని మనోరమ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై జి. నరేష్ తెలిపారు.

నేడు ఓటరు చైతన్యంపై 5కె రన్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు పార్లమెంట్ సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా ఓటరు చైతన్యంపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశానుసారం 4న 5గంటలకు 5కె రన్ కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని యువతీ, యువకులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళలు, ప్రజలకు, జిల్లాలోని ఉద్యోగులు, అధికారులు స్వచ్ఛందంగా 5కె రన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | మే 04, 2024 | www.navatelangana.com

ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలపించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండలంలోని పలు వీధుల్లో పర్యటించిన బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ మాజీ వైస్ ఎంపీపీ సలీమోద్దీన్ కారు గుర్తుకు ఓటేసి ఆత్రం సక్కుని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఆడ బిడ్డలకు కాంగ్రెస్ పార్టీ రూ.2వేల 500 ఇస్తామని మోసం చేసిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి



మాటలను నమ్మి మోసపోయామని ఇప్పటి వరకు రూ.2వేల 500 రాలేదని అన్నారు. ఓటు వేసేటప్పుడు ఆలోచించి ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్, దినేష్, ఖదీర్, ఆసిఫ్, జాబర్, రాజన్న, గౌస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని కళాశాల ఇన్‌చార్జి బాలాజీ కాంబ్లె అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, ప్రవేశం కల్పించారు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. కళాశాలలో చదివిన విద్యార్థులు అన్నీ రంగాల్లో రాణిస్తున్నారనీ వివరించారు. అడ్మిషన్ డ్రైవ్‌లో పోషకులు చిన్నయ్య, పల్లపురెడ్డి, లక్ష్మి ప్రేమ్, పాండురంగ్ ఉన్నారు.



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

● డీడబ్ల్యూఓ సబిత



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

బాల్యవివాహాలు చేయడం చట్టరీత్య నేరమని డీడబ్ల్యూఓ సబిత అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర బాలికలకు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు పురుషులతో సమానంగా హక్కులు కలిగివున్నాయన్నారు. ఆడపిల్లలకు సైతం ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. తల్లిదండ్రులు ఆడపిల్లను భారంగా ఆలోచించి చిన్న తనంలోనే బాల్యవివాహాలు చేయడం నేరమన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం బెటి బచావో.. బెటి పడావో.. నినాదాన్ని తీసు కొచ్చిందన్నారు. ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే పెండ్లిలు చేయాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు జరిపిన, వారికి ప్రోత్సహించిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం నిర్వాహకులు యశోద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, అనిత, అంగన్‌వాడీ వర్కర్లు సుభద్ర పాల్గొన్నారు.

నార్నూర్ : తల్లిదండ్రులు వయస్సు నిండకుండా బాల్యవివాహాలు చేయడం నేరమని డీసీపీఓ రాజేంద్రప్రసాద్, సీడీపీఓ శారద, లిగల్ కోఆర్డినేటర్ రమేష్‌లు అన్నారు. శుక్రవారం ఉమ్మడి మండలాల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నార్నూర్ మండల కేంద్రంతో పాటు గాదిగూడ మండలంలో లోకారి(కె) గ్రామాల్లోని రైతు వేదికల్లో అంగన్‌వాడీ కార్యకర్తలతో బాలింతలు వారి తల్లిదండ్రులతో విడివిడిగా బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006 బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం బాల్య వివాహాలు చేయడం నేరమని అన్నారు. అలా వివాహాలు జరిపితే రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు లక్ష జరిమానా విధించబడుతుందన్నారు. ఎవరైనా బాల్యవివాహాల జరిపితే పోలీసు హెల్ప్ లైన్ 100 లేదా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నెంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. బాల్య వివాహాలు జరిపి కలిగే నష్టాలపై వివరించారు. బాల్య వివాహాలు అపుదాం, బాల్యాన్ని రక్షిద్దాం, ఆడపిల్లల పై పెండ్లిల భారం వద్దని అన్నారు. పుస్తకాలు మోసే వయస్సులో పుస్తెల భారం వద్దని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, సీనియర్ అసిస్టెంట్ సతీష్‌రెడ్డి, సూపర్‌వైజర్‌లు ఉమా, వందన, లక్ష్మీ ప్రదిపిక, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అనిల్, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : బాల్య వివాహాలు జరగకుండా అరికట్టాలని ఎస్సై నరేష్ అన్నారు. శుక్రవారం మండలం కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ మే 10న అక్షయ తృతీయ సందర్భంగా బాల్యవాహాలు గ్రామాల్లో జరగకుండా చూడాలని, బాల్య వివాహాలపై ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమం జరిపించాలని, బాల్య వివాహాలు ఎక్కడ జరిగిన డయల్ 100 నెంబర్‌కి ఫోన్ చేసి తెలియజేయాలని అన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్య నేరమని వారికి తగిన శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం మండల హెల్త్ సూపర్‌వైజర్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయని, దానివల్ల మరణాలు కూడా సంభవిస్తాయని అన్నారు. దీనిపై తల్లిదండ్రులు అవగాహన చేసుకుని బాల్య వివాహాలు చేయకుండా చూడాలని పేర్కొన్నారు. అనంతరం బాల్య వివాహాలు జరగకుండా అరికట్టడానికి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ కోఆర్డినేటర్ సతీష్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ రవికాంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ఏపీఓ శ్రీనివాస్, యువజన సంఘం సభ్యులు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



నార్నూర్ :



బజార్‌హత్నూర్ :

ఉపాధికూలీలకు మజ్జిగా పంపిణీ



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లక్కారం ఉపాధిహామీ పనులకు వెళ్లిన కూలీలకు శుక్రవారం మజ్జిగాను సామాజిక కార్యకర్త ఆజ్మీరా జయచంద్ర నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండని దృష్టిలో పెట్టుకొని కూలీలు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు పనులను ముగించి తిరిగి ఇంటికి చేరుకోవాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు టెంట్, నీళ్లను సంబంధిత అధికారులు ఏర్పాటు చేయాలని సూచించారు.

మతోన్మాద ఫాసిస్టు బీజేపీని దాని మిత్ర పక్షాలను ఓడించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

మతోన్మాద ఫాసిస్టు బీజేపీనీ దాని మిత్ర పక్షాలను ఓడించాలని (ప్రజాపంథా) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నందిరామయ్య అన్నారు. శుక్రవారం ఉట్నూర్‌లోని రాంజీ గోండు భవన్ మాస్‌లైన్ (ప్రజాపంథా) పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల జనరల్ బాడి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 18వ లోకసభ ఎన్నికలు అత్యంత కీలకమైనవనీ, గత 70 ఏండ్లుగా జరిగిన సాధారణ ఎన్నికలు కావని, ఈ ఎన్నికలు భారత ప్రజల ప్రజాస్వామిక వాంఛలకు ప్రతిబింబంగా మారాలని కోరారు. ఈ ఎన్నికలలో ఫాసిస్టు బీజేపీనీ, ఆర్ఎస్ఎస్ కూటమిని, ప్రజాస్వామిక, లౌకిక, వామపక్ష, ప్రజాశక్తులంతా కలిసి ఓడించాలని అన్నారు. ఈ సమావేశంలో మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగన్ సింగ్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు ఆజ్మీర వినోద్ కుమార్, జిల్లా కార్యదర్శి కుమ్ర అశోక్, పీవైఎల్ జిల్లా కన్వీనర్ వాగ్మారే ప్రజ్ఞశీల్, నాయకులు కొడుప సురేష్, మడవి రేణుక, బుచ్చిరాం, చరణ్ పాల్గొన్నారు.

ఎకరానికి 25క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-సారంగాపూర్

ప్రభుత్వం జొన్న పంటను ఎకరానికి 25క్వింటాళ్లు కొనుగోలు చేయాలని మంత్రి సీతక్కకు శుక్రవారం కౌట్ల(బి) గ్రామస్తులు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడారు. సారంగాపూర్ మార్క్‌ఫెడ్ ద్వారా ఎకరానికి 8క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ సారి పంట దిగుబడి 25 నుంచి 30 క్వింటాళ్లకు పెరిగిందని అన్నారు. కష్టపడి పండించిన పంటలను ఎలా అమ్ముకోవాలని అన్నారు. ప్రభుత్వం ఎకరానికి జొన్నలు 25క్వింటాళ్లు కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, కౌట్ల(బి) ప్యాక్స్ సొసైటీ అధ్యక్షులు నకిరెడ్డి నర్సారెడ్డి, సభ్యులు, రైతులు ఉన్నారు.

ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంటు సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని ఆదిలాబాద్ లోక్ సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షిషా, సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్ సమక్షంలో ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. గురువారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈవీఎంల సెకండ్ ర్యాండమైజేషన్ జరిపారు. పార్లమెంటు సెగ్మెంట్‌లోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 2,220 పోలింగ్ కేంద్రాలకు కేటాయించే బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఈ ప్రక్రియ గురించి కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరిస్తూ, స్క్రీన్‌పై పారదర్శకంగా చూపించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఖరారైన జాబితాను అభ్యర్థులు, ఆయా పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ ర్యాండమైజేషన్ జాబితా ఆధారంగానే పార్లమెంటు పరిధిలోని ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముధోల్, ఆసిఫాబాద్, సిర్పూర్, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు కేటాయించడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే ఆయా సెగ్మెంట్లలో స్ట్రాంగ్ రూమ్‌లలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ వాటిని భద్రపర్చడం జరిగిందని తెలిపారు. మొత్తం 2,220 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా 25శాతం అదనంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను రిజర్వ్ లో ఉంచడం కోసం కేటాయిస్తున్నామని తెలియజేశారు. 35 శాతం వీవీ ప్యాట్‌లను రిజర్వ్‌లో ఉంచేలా అదనంగా కేటాయిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, నిర్మల్ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ వినోద్ కుమార్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



నేడు మాదిగల మహాధర్నాను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

హైదరాబాద్‌లో శనివారం తలపెట్టిన మాదిగల మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత పందేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదేదారిని అవలంబిస్తుందన్నారు. రాష్ట్రంలో 50 లక్షల వరకు జనాభా ఉన్న మాదిగ కులానికి ఎంపీ సీట్లు కేటాయించడంలో తీవ్ర అన్యాయానికి గురిచేసిందని ఆరోపించారు. ప్రభుత్వం మాదిగలపై చిన్న చూపుకు నిరసనగా రాష్ట్ర రాజధానిలో చేపడుతున్న మహా ధర్నాకు భారీగా తరలిరావాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి రాజు, కార్యదర్శి రాంప్రసాద్, మాధవ్ పాల్గొన్నారు.

హోం ఓటింగ్ బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి



నవతెలంగాణ-ఉట్నూర్

మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హోం ఓటింగ్‌కి సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లను కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉట్నూర్ మండలంలో 195 ఓటర్లు హోం ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఓట్ ఫ్రమ్ హోమ్



నవతెలంగాణ-తలమడుగు

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో తొలిసారిగా వృద్ధులు, వికలాంగుల కోసం శుక్రవారం బోథ్ నియోజకవర్గంలో ఓట్ ఫ్రమ్ హోమ్ ఓటును వినియోగించుకున్నారు. ప్రత్యేకంగా వికలాంగులు, వృద్ధుల కోసం కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించినట్లు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఓట్ ఫ్రమ్ హోమ్‌లో భాగంగా ఎన్నికల సిబ్బంది సదరు ఓటరు ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేయించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని, బోథ్ సెగ్మెంట్‌లోని పాట్నాపూర్, బోథ్‌లో వయోవృద్ధులు, దివ్యాంగులు ఓట్ ఫ్రమ్ హోమ్‌లో భాగంగా ఇంటి నుంచే ఈసీఐ నిబంధనల ప్రకారం ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ఇంటి నుంచే ఓటు వేసేలా కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 85 సంవత్సరాలు పైబడిన వారు 416, వయోవృద్ధులు 384, అత్యవసర సర్వీస్ 3, మొత్తం 803 మంది హోమ్ ఓటింగ్ వినియోగించుకోనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓ పాటిల్ వినోద్, మైక్రో అబ్జర్వర్ ప్రవీణ్, బీఎల్ఓ రాఘవేంద్ర, ఏపీఓ ఉమర్, కానిస్టేబుల్స్ ఊశన్న, సుధాకర్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు వొద్నాల రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని పార్‌పెల్లి, ధర్మారం, పీచర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. చేతు గుర్తుకు ఓటు వేసి, ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఉపాధిహామీ పనులు జరుగుతున్న చోటుకి వెళ్లి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈటెల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, సమ్మెట రవి, నగేష్, రాజేందర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, గంగయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును పార్లమెంటుకు పంపించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును పార్లమెంటుకు పంపించాలని బాధ్యత మాపై ఉందని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని మత్తడిగూడలో పర్యటించి, కారుగుర్తుకు ఓటు వేసి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతుబంధు వేయలేదని అన్నారు. ప్రజలు ఎంపీ ఎన్నికలో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. ఈ ప్రచారంలో సిడం సోనేరావు, కోళ్ల సత్యాన్న, మత్తడిగూడ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ఇంటింటికీ ప్రచారం

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని మోమిన్‌పుర కాలనీలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ శుక్రవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. దేశ భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌ని ఆదరించి, చేయి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజల సమస్యలను తీర్చడానికి ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా రాజీనామా చేసి, రాజకీయాల్లోకి వచ్చానని, తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎమ్మెల్యే నివాసంలో వడోని గ్రామానికి చెందిన యువకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికీ కండువా కప్పి పార్టీలో సాధారంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 10 ఏండ్ల బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 3 నెలల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఆరోగ్య శ్రీ పథకం కింద 10 లక్షల భీమా, లాంటి ప్రతిష్టాత్మకమైన సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. పేదల బ్రతుకులు మారాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావాలని అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశంలో సుపరిపాలన అందిస్తారన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

పార్లమెంట్ ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగ ఉపాధ్యాయులందరూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మే 3 నుంచి 8వ తేది వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. శుక్రవారం మండలానికి చెందిన ఉపాధ్యాయులు కొందరు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ విధానంలో వేశారు.

నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | మే 04, 2024 | www.navatelangana.com

5న కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

ఈ నెల 5న మండల కేంద్రంలో నిర్వహించే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎంఎల్‌సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు వస్తున్నారని, ఈ సమావేశానికి పెంచికల్‌పేట్, దహెగాం మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బిట్టు శ్రీనివాస్, రాచకొండ కృష్ణ, నగునూరి శ్రీనివాస్, శంకర్‌గౌడ్, కొలిపాక శ్రీనివాస్, మహేష్, చిన్నయ్య, శ్రీకాంత్, శేఖర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని మోతుగూడ గ్రామ బస్టాండ్ ఆవరణలో రాజురా, మోతుగూడ గ్రామాల యువత స్థాపించిన వరల్డ్ ఆఫ్ విజ్డం సోసియో వెల్ఫేర్ సొసైటీ(డబ్ల్యూ డబ్ల్యూ ఎస్ డబ్ల్యూ ఎస్) ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎండ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సాధ్యమైనంత ఎక్కువగా నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు లోనారే కిరణ్, ఉపాధ్యక్షుడు బొమ్మెన నరేష్, కార్యదర్శి నగేష్ యాదవ్, సొసైటీ సభ్యులు పెంటయ్య, పవన్ పాల్గొన్నారు.

అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అందివచ్చిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చైతన్య కళాశాలలో జీజేఎల్ఏ, ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో జీజేఎల్ఏ జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అధ్యక్షతన ఇంటర్మీడియట్ పూర్తి అయిన విద్యార్థులకు ఎంఎస్ఎన్ లాబరేటరీస్ సంస్థ వారు నిర్వహించిన "ఉద్యోగంతో పాటు ఉచిత డిగ్రీ" ప్రవేశాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్థ వారు నిర్వహించిన పరీక్షలు ఇంటర్వ్యూలకు 80 మంది హాజరు కాగా 14 మంది ఉచిత విద్య ఉద్యోగానికి ఎంపికైనట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారి కోసం భవిష్యత్తులో తమ సంఘం ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ ఉషారాణి, ఇంపాక్ట్ సంస్థ నిర్వాహకులు ధర్మపురి వెంకటేశ్వర్లు, సంతోష్ కుమార్, జీజేఎల్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల్కార్ శ్రీనివాస్, నాయకులు రాజమౌళి, చంద్రయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆహ్లాదానికి ఆదరణ కరువు..!

- చిల్డ్రన్ పార్క్‌లో లోపించిన నిర్వహణ
- పనిచేయని ఫౌంటెన్, విరిగిన ఊయల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లా ఏర్పడిన తరువాత జిల్లా కేంద్రంలో ప్రజలకు కనీసం ఆహ్లాదం లేదని గుర్తించిన అప్పటి అదనపు కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పిల్లలు ఆడుకునేలా పెద్దలకు ఆహ్లాదాన్ని అందించేందుకు రెండున్నర కోట్ల వ్యయంతో చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేశారు. అయితే అప్పటి నుంచి జీపీ అధికారులు పార్క్ నిర్వహణ చూస్తున్నారు. తాజాగా ఆసిఫాబాద్ జీపీ నుంచి మున్సిపాలిటీగా మారడంతో అధికారుల మార్పు ఇతర పనులు అప్పగిస్తున్నారు. దీంతో పార్కు నిర్వహణపై అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



పార్కు ముఖద్వారం



విరిగిపోయిన ఊయల



పని చేయని ఫౌంటెన్

కానరాని ఆహ్లాదం

పార్క్ ఏర్పాటు చేసిన తర్వాత క్యాంటీన్ ఏర్పాటుతో పాటు బొంగులతో వెయిటింగ్ రూమ్ వలే ఏర్పాటు చేశారు. దీనికి లైటింగ్ అమర్చారు. రాత్రి పూట పార్క్ ఎంతో అందంగా కనిపించేది. అయితే ఇప్పుడు పార్కులో అదేది కనిపించడం లేదు. క్యాంటీన్ నడిపించడం లేదు. దాని తోపాటు పార్కులో మొక్కల నిర్వహణపై కూడా పెద్దగా శ్రద్ధ చూపడం లేదు.

పనిచేయని ఫౌంటెన్, విరిగిన ఉయ్యాల

పార్క్ మధ్యలో లైటింగ్‌తో కూడిన ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. ఇది ప్రతి రోజు సాయంత్రం పార్కుకు వెళ్లే వారికి ఎంతో అందంగా కనిపించేది. ఫోటో సెల్ఫీలు దిగి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసేవారు. గత కొంతకాలంగా ఫౌంటెన్ పని చేయకపోవడంతో సాయంత్రం పూట పార్కు అందాలు కరువయ్యాయి. అలాగే పిల్లలు ఉడడానికి రెండు ఉయ్యాలలు ఏర్పాటు చేశారు. వాటిలో ఒకటి తెగిపోయి నాలుగు నెలలు గడుస్తున్నా వాటిని మరమ్మతులు చేయించడం లేదు.

మున్సిపాలిటీగా మారడమే కారణమా..?

గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్‌ను ప్రభుత్వం మున్సిపాలిటీగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంలో గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీకి రికార్డులు బదిలీ చేయడంతో పాటు నూతన అధికారుల కేటాయింపు జరుగుతుంది. ఇదంతా ప్రక్రియ ఇంకా పూర్తి కావడానికి సమయం పడుతుంది. మున్సిపాలిటీ నిర్వహణపైనే అధికారులు బిజీకావడంతో పార్కు నిర్వాహణ పూర్తిగా లోపించిందని పలువురు పేర్కొన్నారు.

త్వరలో మరమ్మత్తులు చేయిస్తాం

భుజంగరావు, మున్సిపల్ కమిషనర్

నూతన మున్సిపాలిటీగా అసిఫాబాద్ ఏర్పడిన తర్వాత ఇంకా రికార్డుల బదిలీ జరుగుతుంది. పార్కు నిర్వహణ మున్సిపాలిటీ పరిధిలో పక్కగా చేపడతాం. ప్రస్తుతం చెడిపోయిన వాటిని మరమ్మతులు చేయడంతో పాటు మరిన్ని నూతన వస్తువులు అమర్చడానికి ప్రయత్నాలు చేస్తాం. జిల్లా కేంద్రంలోని ప్రజలకు ఎల్లప్పుడూ ఆహ్లాదాన్ని అందించేందుకు ప్రయత్నం చేస్తాం.

మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి



నవతెలంగాణ-కెరమెరి

మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని జడ్పీటీసీ సెద్మకి ద్రుపతబాయి అన్నారు. శుక్రవారం మండలంలోని చింతకర్ర గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేసిందన్నారు. అమలుకు సాధ్యంకాని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కేవలం ఉచిత బస్సు పథకం తప్ప ఇతర పథకాలేవీ అమలు చేయడం లేదని విమర్శించారు. కళ్యాణలక్ష్మి పథకంలో పెళ్లి చేసుకునే యువతులకు తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి కరెంటు కష్టాలు మొదలైనట్లు పేర్కొన్నారు. మోసపూరిత కాంగ్రెస్‌కు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోగర్ల రాజయ్య, బీఆర్ఎస్ నాయకులు, కుంరం భీంరావు, పెందూర్ ఆనంద్‌రావు, మడావి రఘునాథ్, మున్ను, రాంచందర్ పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది ఓటు వేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ ధోత్రే
- పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుని వినియోగించుకోవాలని ఎన్నికల అధికారి వెంకటేశ్ ధోత్రే అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వహించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుండి 8వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుని ఈ కేంద్రంలో వినియోగించుకోవాలని తెలిపారు. మొత్తం 2420 మంది ఉద్యోగులు ఈ ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాట్లపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు, ఫెసిలిటేషన్ కేంద్రంలో విధులు నిర్వహించే ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీఓ లోకేశ్వరరావుతో తహశీల్దార్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

- ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలి



మేనిఫెస్టో పోస్టర్లను కూలీలకు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - రెబ్బెన

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని గోలేటిలోని ఉపాధిహామీ పని స్థలంలో పార్లమెంటు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 75 సంవత్సరాల చరిత్రలో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి ఓ ఆదివాసీ మహిళకు అవకాశం వచ్చిందని, ఆమెను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం కాంగ్రెస్ మెనీఫెస్టోను ప్రజలకు వివరించారు. నరేంద్రమోడీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. జన్ ధన్ అకౌంట్లు ఓపెన్ చేసి నల్లధనం వెనక్కి తీసుకొచ్చి ఖాతాల్లో వేస్తానని చెప్పి డబ్బులు వేయలేదన్నారు. ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచారన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందన్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కేసీఆర్‌కు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉపాధిహామీ కూలి రేటు రూ.400 పెంచుతామన్నారు. అదేవిధంగా రానున్న కొద్ది రోజుల్లోనే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. ధరలను కూడా నియంత్రిస్తామన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గం రవీందర్, సంఘం ప్రకాష్‌రావు, జిల్లెల స్వామి, సాంబగౌడ్, పూదరి సాయి, దుర్గం తిరుపతి, మంగీలాల్, గట్టయ్య, అడప విమల పాల్గొన్నారు.

రాజకీయ సన్యాసానికి సిద్ధంగా ఉండండి

- ఎమ్మెల్యే కోవలక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్‌కు నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ మెజార్టీ తప్పనిసరిగా వస్తుందని సీఎం సభలో మాట్లాడిన నాయకులు రాజకీయ సన్యాసానికి సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఘాటు వ్యాఖ్యలు చేశారు. జిల్లా కేంద్రంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాల కుదింపు ప్రక్రియ ప్రభుత్వం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటు ఆదివాసుల మనోభావాలతో కూడుకున్నదని, ఒకవేళ జిల్లాల కుదింపులో ఆసిఫాబాద్‌ను ముట్టుకుంటే అగ్గి పుట్టిస్తామని, కాంగ్రెస్ నాయకులను జిల్లాలో తిరగనియ్యమని హెచ్చరించారు. చిన్న జిల్లాల ఏర్పాటలో భాగంగా ఆసిఫాబాద్ ఏర్పాటు చేయడంతో మెడికల్ కళాశాల, డయాలసిస్, డయాగ్నస్టిక్స్ సెంటర్, 300 పడకల ఆస్పత్రి వచ్చినట్లు గుర్తు చేశారు. సీఎం సభలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను ఖాళీ చేస్తామని, పార్లమెంట్ ఎన్నికల్లో అధిక మెజార్టీ చేస్తామని చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. రాజకీయ సన్యాసానికి సిద్ధంగా ఉండాలంటూ హెచ్చరించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే అభివృద్ధి చేసే వాళ్లమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట అభివృద్ధి చేయరా అని ప్రశ్నించారు. ప్రజా పాలన అంటే ఇదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో అడ ప్రాజెక్టు పూర్తి చేశారని, నాణ్యత లేమితో పగుళ్లు వచ్చాయని తమ హయాంలో మరమ్మతులు చేద్దామనుకునేలోపు అప్పటి ఎన్నికల కోడ్ వచ్చిందని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో తిరిగే పరిస్థితి లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అధిక మెజార్టీ తీసుకురావడం ఖాయమని, చిన్న జిల్లాలను ముట్టుకుంటే అగ్గి పుట్టించడం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, నాయకులు రవీందర్, నిస్సార్, చిలువేరు వెంకన్న, అహ్మద్, తారిక్, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థుల కృషి అభినందనీయం

- అందవెల్లి యూత్ ఫెడరేషన్ సత్కారం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

అందవెల్లి గ్రామం నుంచి ఇంటర్, పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుల కృషి అభినందనీయమని అందవెల్లి యూత్ ఫెడరేషన్ నాయకులు బోగ శ్రీనివాస్, పూదరి శ్రావణ్ కుమార్‌లు కొనియాడారు. అందవెల్లి గ్రామం నుంచి ఇంటర్మీడియట్‌లో జిల్లా మొదటి ర్యాంకు సాధించిన బూరం ఆలేఖ్య, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన చంద్రగిరి తిరుపతి, పదో తరగతి ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించిన జీల్ల అభిలాష్‌లను అందవెల్లి యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు బోగ శ్రీనివాస్, పూదరి శ్రావణ్ కుమార్‌లు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు సాధించి గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని, ఎలాంటి ఆటంకాలు ఎదురైన మీకు అండగా సంఘం ఉంటుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీల్ల శ్రీకాంత్, ఎరవేని వెంకటేష్, మాదాసు మల్లేష్, జక్కుల రవి, జీల్లా వినోద్ కుమార్, జక్కుల సాయికుమార్, కోట బాపు, జీల్ల పెంటయ్య పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024 సంవత్సర హజ్ యాత్రకు ఆసిఫాబాద్ పట్టణం నుంచి వెళ్లే యాత్రికులు అబ్దుల్ రహమాన్, షేక్ చాంద్, ముజఫర్ హుస్సేన్‌లను జామా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మస్జిద్ ఆవరణలో పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రపంచంలో శాంతి వాతావరణం ఉండాలని, భారతదేశ అభివృద్ధిలో ముందడుగు వేసి దేశ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించాలని మస్జిద్ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో జామా మస్జిద్ అధ్యక్షుడు అబ్దుల్ ఫయాజ్, కమిటీ బాధ్యులు హకీమ్ అన్సారి, సయ్యద్ జావిద్, సాలం, షబ్బీర్, ఎండీ అహ్మద్, షాకీర్, షాహిద్, అమర్ బిన్ హసన్, సీనియర్ సిటిజన్‌లు ఎండీ రియాజ్, అబ్దుల్ బాసిత్, రహమత్‌నగర్ కాలని వాసులు పాల్గొన్నారు.

ఆత్రం సక్కు గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కిర్డీ గ్రామ పంచాయతీలో గురువారం జడ్పీటీసీ అజయ్‌కుమార్ వాడవాడలో తిరుగుతూ బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎంపీ ఆత్రం సక్కును కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్ అన్నారు. ప్రజలకు అండగా ఉంటానని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండె తుకారాం, బంబారా మాజీ ఎంపీటీసీ వినోద్‌కుమార్, వీఎస్ఐ అధ్యక్షుడు అశోక్, సిండె వాసు, సాగర్ పాల్గొన్నారు.

సమావేశానికి తరలివెళ్లిన సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్‌లో సీపీఐ(ఎం) పార్లమెంటు స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా జిల్లా కార్యదర్శి కుశాన రాజన్న ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలో ఇంద్రవెల్లి స్థూపం వద్ద అమరులకు ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించడం కోసం పని చేస్తామన్నారు. రాంజీ గొండ్, కుమురంభీం పోరాటాలు నడిపిన గడ్డ ఆదిలాబాద్ పార్లమెంట్ అని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో ఆదివాసి సెంటిమెంట్‌తో గెలిచిన సోయం బాపురావు నియోజకవర్గ అభివృద్ధికి ఏమీ చేయలేదన్నారు. దేశంలో బీజేపీ మతం పేరుతో, దేవుడి పేరుతో ఓట్లు అడుగుతుందని వారి ఆటలు పోరాట గడ్డ మీద సాగవన్నారు. బీజేపీ అభ్యర్థిని మార్చడంతోనే తన ఓటమిని అంగీకరించిందన్నారు. ఈ పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం కృషి చేస్తామని, ప్రతి ఒక్కరు చెయ్యి గుర్తుకు ఓటు వేసి పేదింటి ఆదివాసి ఆడపడుచును, ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ వెళ్లిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, ముంజం శ్రీనివాస్, దుర్గం రాజ్ కుమార్, నాయకులు కొరెంగ మాలశ్రీ, గెడం టీకనాంద్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



నవతెలంగాణ-మందమర్రి

అందుగులపేట గ్రామ పంచాయతీలో 250 మంది ఉపాధి హామీ కూలీలకు శుక్రవారం మండల కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కడార్ జీవన్ కుమార్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ తెలంగాణలో అధికారం వచ్చిన వెంటనే మూడు గ్యారంటీలను అమలు చేస్తుందని, మరో మూడు గ్యారెంటీలు త్వరలో అమలు చేస్తుందన్నారు. గడ్డం వంశీకృష్ణను పెద్దపల్లి పార్లమెంట్ నుంచి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశంలో కాంగ్రెస్ 5 గ్యారంటీలను ప్రవేశపెట్టిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యారెంటీలను అమలుపరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాల్వ కుమార్, రేగుంట రాజయ్య, శేఖర్, నాసర్, మేకల రాజేష్, కార్తీక్, సందీప్, భాస్కర్ పాల్గొన్నారు.

జన్నారంలో హోమ్ ఓటింగ్ ప్రారంభం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలో ఎన్నికల అధికారులు హోమ్ ఓటింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. 85 సంవత్సరాలు దాటి పోలింగ్ కేంద్రాలకు రాలేని వృద్ధులు, వికలాంగుల కోసం కేంద్ర ఎన్నికల సంఘం హోమ్ ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించింది. మండలంలోని ఇందంపల్లి గ్రామంలో ఉన్న సూరం గంగవ్వ అనే, వికలాంగురాలను ఎన్నికల అధికారులు ఓటు వేయించి హోమ్ ఓటింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, వికలాంగుల ఇళ్లకు వెళ్లి అధికారులు ఓటింగ్ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ ఉమాదేవి, పీఓ సత్యవాన్, ఏపీఓ రవికుమార్, తహసీల్దార్, సి రాజ మనోహర్‌రెడ్డి, మైక్రో అబ్జర్వర్ సాయికుమార్ అసిస్టెంట్ ఆర్ సురేష్, ఆర్ఐ భానుచందర్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గం అనసూర్య, ఈ మధ్యకాలంలో మృతి చెందడంతో ఆ పేద కుటుంబానికి శుక్రవారం కిష్టాపూర్ గ్రామ బీజేపీ ఆధ్వర్యంలో రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. అసలే పేదరికంతో బాధపడుతున్న ఆమె ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు సిలిండర్ను ఎత్తుకెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాసాల నరేష్ మండల ప్రధాన కార్యదర్శి గాజుల దేవేందర్, గ్రామ అధ్యక్షుడు ముంజంపల్లి సాయికుమార్, బూత్ అధ్యక్షుడు చెవుక మహేష్, ఒడిపెల్లి రాజేష్ ,ప్రధాన కార్యదర్శులు ప్రశాంత్, నరేష్, నాయకులు మల్కాల్ల సత్తన్న, మల్లేష్, వెంకటేష్, అఖిలేష్, నాగరాజు, సతీష్, శ్రీకాంత్, ప్రవీణ్, చందు, శ్రావణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ నాయకులే దిక్కయ్యారు

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి
- కొండాపూర్ యాపలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ-కాసిపేట

కాంగ్రెస్‌కు క్యాడర్, లీడర్లు లేక బీఆర్ఎస్ నాయకులనే చేర్చుకొని పబ్బం గడుపుకుంటూ బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం సిగ్గు చేటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాసిపేట మండలం కొండాపూర్ యాపలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారంలో భాగంగా గతంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, ఇప్పుడు కాంగ్రెస్ హామీలు ఇచ్చి అమలు చేయకుండా చేస్తున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బొల్లు రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కాంగ్రెస్‌ను ఎందుకు గెలిపించామని బాధ పడుతున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగిందని, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని ప్రజలే చెప్తున్నారని, ప్రజలకు కాంగ్రెస్ పాలనలో ఏమీ లేదని అర్థమై బాధపడుతున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు నాయకులు, ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉండే వాళ్ళని, కాంగ్రెస్ వచ్చాక అసలు ప్రజల సమస్యలను పట్టించుకునే వారే లేరన్నారు. కొంత మంది కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని, కాంగ్రెస్‌కు క్యాడర్, లీడర్లు లేక దండాలు పెట్టి బీఆర్ఎస్ నాయకులను చేర్చుకొని వాళ్ళ సొంత క్యాడర్ లాగా బిల్డప్‌లు ఇస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌ను వీడి స్వార్థ పరులే వెళ్తున్నారని, అలాంటి వాళ్ళతో ఎటువంటి నష్టం లేదన్నారు. కాంగ్రెస్ పాలన ప్రజలకు అర్థమైందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు నిర్ణయం తీసుకున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీని బీఆర్ఎస్‌కు కట్టబెడుతారన్నారు. పెద్దపల్లి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కంది ధర్మయ్య, బీఆర్ఎస్ నాయకులు ఏనుగు సుధాకర్‌రెడ్డి, పోడేటి రాజా గౌడ్, సుమన్ గౌడ్, రమేశ్, శక్రియ నాయక్, మంగా శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయొద్దు

- మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

అక్రమంగా వెలసిన అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసి మోసపోవద్దని మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని ఉత్కూరు శివారు సర్వే 255, 253, 255, 256, 361, 377 నెంబర్లలో, మోదెల శివారులోని సర్వే 66, 67 నెంబర్లలో అక్రమంగా వెలసిన వెంచర్లను గుర్తించి బుల్డోజర్ సహాయంతో హద్దు రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ చట్టం 2019లోని సెక్షన్ 172(6) ప్రకారం ఆమోదం లేని లేఅవుట్‌లలో ప్లాట్‌లను రిజిస్టర్ చేయవద్దని లక్షెటిపేట తహసిల్దార్, సబ్ రిజిస్టర్‌కు లేకరాశామని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతి పొందబడిన లేఅవుట్లలోనే ప్లాట్లు కనుగోలు చేయాలని, వీటిలో అయితే విశాలమైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, నీటి సరఫరా మొదలైన మౌలిక సదుపాయాలు, ఆట స్థలాలు, పార్కులు, లాంటి సౌకర్యాలు ఉంటాయని తెలిపారు.

కార్మికులకు ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుంది : జనక్ ప్రసాద్

నవతెలంగాణ-నస్పూర్

కార్మికులకు అండగా ఐఎన్టీయూసీ ఎప్పుడు ఉంటుందని ఆ సంఘం సెక్రటరీ జనరల్, వేజ్ బోర్డ్ శాశ్వత సభ్యులు, మినిమం వేజెస్ అడ్వైజర్ బోర్డ్ చైర్మన్ జనక్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఐఎన్టీయూసీ 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని గనులలో శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అధ్యక్షతన జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరాంపూర్ ఓసీలో నూతన జెండాను జనక్ ప్రసాద్ ఆవిష్కరించి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో ఐఎన్టీయూసీ కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారా ఉద్యోగాలలో రిజర్వేషన్, ఉద్యోగ భద్రత, పెన్షన్ గ్రాట్యూటీ, విద్య, వైద్యం, కార్మికులకు క్వాటర్ సౌకర్యం కల్పించడంతోపాటు ఆర్థికంగా కాపాడుకుంటుందని తెలిపారు. దేశంలో అత్యధికంగా సభ్యత్వం కలిగిన కార్మిక సంఘం ఐఎన్టీయూసీ అని తెలిపారు. రానున్న కాలంలో సింగరేణిలో నూతన గనులు, అనుబంధ పరిశ్రమలు, పవర్ ప్లాంట్‌లు ఏర్పర్చి స్థానికులకు ఉద్యోగాలు కల్పించి, కోల్డ్ కారిడార్ ఏర్పాటు చేస్తూ కార్మికులకు సింగరేణిలో వారి హక్కుల కోసం నిరంతరం కార్మికుల పక్షాన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా సెక్రెటరీ నీలం చిన్నయ్య, సీహెచ్ భీం రావు, గరిగ స్వామి, కలవేన శ్యామ్, తిరుపతిరెడ్డి, అనిల్, తిరుపతి, రాజు, శ్రీనివాస్, కుమారస్వామి, మహేందర్‌రెడ్డి, నీలం సదయ్య పాల్గొన్నారు.

బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించండి



నవతెలంగాణ-మంచిర్యాల

మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికలలో బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మార్కిస్టు) నాయకులు కోరారు. బీజేపిని ఓడించేందుకు హస్తం గుర్తుకు ఓటేయాలని సీపీఐ(ఎం) నాయకులు తెలిపారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలో నిర్వహించిన పార్లమెంటు నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు గోమాస ప్రకాష్ మాట్లాడుతూ పదేండ్ల మోడీ పాలన ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఎమర్జెన్సీని మించిన నియంతృత్వ పోకడలు పోతోందని, రాజ్యాంగ మౌలిక సూత్రాలయిన ప్రజాస్వామ్యం, లౌకిక విలువల మీద దాడి చేస్తున్నదని అన్నారు. మతం పేరుతో, రాముడి పేరుతో ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మత ప్రాతిపాధికన ప్రజల మధ్య విభజన సృష్టిస్తు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తుందన్నారు. ఈసారి మళ్ళీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే రద్దు చేసి మత రాజ్యం స్థాపించాలని ప్రయత్నిస్తోందని తెలిపారు. కులవ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా కులవివక్షను కొనసాగించేందుకు పూనుకుంటున్నదని, ఈ చర్యలు ప్రజల శాంతియుత జీవనానికి, దేశ సమైక్యతకు, శ్రామికుల ఐక్యతకు ప్రమాదకరమని అన్నారు. ఈ ఎన్నికలలో మోడీని గద్దె దించడం ద్వారా దేశాన్ని కాపాడుకోగలమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న అన్ని పోరాటాలకు సీపీఐ(ఎం) అండగా నిలుస్తున్నదని తెలిపారు. ప్రత్యామ్నాయ విధానాలు అమలుజరపడం ద్వారా కేరళ వామపక్ష ప్రభుత్వం దేశానికే దిక్సూచిగా నిలిచిందని అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక విలువల పరిరక్షణ కోసం సీపీఐ (ఎం) నిరంతరం పోరాడుతోందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్, నాయకులు ప్రేమ్ కుమార్, మహేష్, మోహన్, రాములు, రాజు, తిరుపతి పాల్గొన్నారు.

ఐటీ స్లాబ్ సవరణకు కృషి చేస్తా

- ప్రతి కార్మికుడి సొంతింటి కళ నెరవేరుస్తాం
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ



నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి కార్మికులకు ఐటీ స్లాబ్ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వంతో అవసరమైతే పోరాడి సవరణకు కృషి చేస్తామని ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ పేర్కొన్నారు. శుక్రవారం కాసిపేట గని ముందు నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఐఎన్టీయూసీ నాయకులతో కలిసి గేట్ మీటింగ్‌లో పాల్గొని కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి సింగరేణి కార్మికుడి సొంతింటి కళ నెరవేరుస్తామని, 250 గజాసాల ఇంటి స్థలంలో పాటు రూ.15 లక్షల రుణ రహితలోను ఇప్పిస్తామన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిలో చేసిందేమి లేదని, కేవలం 20,30 వేల జీతానికి కూడా 4,5 లక్షలు లంచాలు తీసుకొని పనులు ఇప్పించారని విమర్శించారు. హం కిసికే కమ్ నహీ అనే కాకా సూక్తితో ముందుకు వెళ న్నామని, కష్టపడి కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని చెప్పిన కాకా స్ఫూర్తితోనా సొంతంగా పైకప్పు రేకులతో ఉచిత విద్యుత్ వచ్చే విధంగా ఒక పైకప్పు తయారు చేసి ప్రపంచంలోనే మొదటి వ్యక్తిగా అమెరికాలో అవార్డు వచ్చిందని గర్వంగా చెప్తున్నానన్నాని పేర్కొన్నారు. మోటర్ బైక్, ఎలక్ట్రికల్ బైక్ సంస్థను సొంతంగా స్థాపించి అందులో 500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని, అందులో సింగరేణి కార్మికుల పిల్లలే అధిరంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్మికుల బాగోగులు, కష్టసుఖాలు తెలిసి వచ్చాయని, అదే విధంగా సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. 25, 30 వేల కోట్ల కార్మికులకు సింగరేణి నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ విభజించు పాలించు అనే విధానంతో భారత దేశాన్ని నాశనం చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వంకు తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి వంశీ బేటను గెల్పించండి ఢిల్లీకి వెళ్లి మీ కార్మిక సమస్యలను పరిష్కరిస్థామని పేర్కొన్నారు. అనంతరం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మతోన్మాదంతో కార్మికుల 44 కార్మిక చట్టాలను రద్దు చేయాలని చూస్తుందన్నారు. ఎప్పుడో బ్రిటీష్ పాలనలో సాధించిన 44 కార్మిక చట్టాలను ఈ రోజు బీజేపీ ప్రభుత్వం వాటని రద్దు చేసి, వాటి స్థానంలో 4 కోడ్‌ల చట్టాలను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిందని, ఎన్నికల తర్వాత అమలు చేసేందుకు కుట్ర చేస్తుందని, మోదీ ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ అనే హిందూ సంస్థ నడిపిస్తుదని హెద్దేవా చేశారు. మోదీ 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బహిరంగంగానే ప్రకటిస్తున్నారని, దీంతో రిజర్వేషన్లు ఉండవని, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉండవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, మిట్టపల్లి వెంకటస్వామి, అక్బర్, సత్యనారాయణ, చిప్ప నర్సయ్య, మీనుగు లక్ష్మీనారాయణ, శ్రీహరి, సురేష్, ఐఎన్టీయూసీ నాయకులు కాంపెల్లి సమ్మయ్య, మేడ సమ్మయ్య, రాపర్తి శ్రీనివాస్, దేవి భూమయ్య, మంద వెంకటేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మండల ఇన్‌ఛార్జి గడ్డం జగన్నాథం, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, బన్న లక్ష్మణ్‌దాస్, మైదం రమేష్, గోలేటి స్వామి, ధారవేణి రాజయ్య, ఉత్తూరి సత్తయ్య, నస్పూరి నర్సింగ్, అగ్గి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో ర్యాండమైజేషన్ పూర్తి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈ నెల 13వ తేదీన జరుగనున్న పోలింగ్‌కు అదనపు బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తయిందని జిల్లాఎన్నికల అధికారి బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, డీసీపీ అశోక్ కుమార్‌తో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు వి.రాములు, డి.చంద్రకళ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో 42 మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో అదనపు బ్యాలెట్ యూనిట్లు అవసరం ఉన్నందున ఈసీఐఎస్ కంపెనీ నుంచి జిల్లాకు చేరుకున్న 1,800 అదనపు బ్యాలెట్ యూనిట్లతో పాటు పాతవి 88లో 12 యంత్రాలలో సమస్య ఉన్నందున మిగిలిన 76 ఈవీఎంలను కలుపుకొని ర్యాండమైజేషన్ చేయడం జరిగిందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో ప్రథమ స్థాయి పరిశీలన పూర్తి చేసి ర్యాండమైజేషన్ నిర్వహించామని, ఈ క్రమంలో చెన్నూర్ శాసనసభ నియోజకవర్గానిక్ 575, బెల్లంపల్లి నియోజకవర్గానికి 575,మంచిర్యాల నియోజకవర్గానికి 726 కేటాయించడం జరిగిందని, ఆయా సెగ్మెంట్లకు కేటాయించిన ప్రకారంగా గట్టి బందోబస్తు ఏర్పాట్లు మధ్య తరలించి స్ట్రాంగ్ రూమ్లలో భద్రపరిచి 24 గంటల పాటు బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

రాహుల్ గాంధీని ప్రధానిచేయాలి



నవతెలంగాణ-జన్నారం

వచ్చే ఎంపీ ఎన్నికల్లో అదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ మండల కోఆప్షన్ సభ్యులు, ఫసీఉల్లా, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, మహమ్మద్ రియాజుద్దీన్, ఎస్సీ సెల్ మండల నాయకుడు ఈరునాళ్ల గంగన్న అన్నారు. శుక్రవారం మండలంలోని బుడగ జంగాల కాలనీలో, రాంనగర్, మేదరి వాడలో రాంపూర్‌లో, వేరువేరుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆరు గ్యారెంటీ స్కీములను తప్పకుండా అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గంగన్న, రాజన్న, నరసింహారావు, పద్మారావు, రాజన్న పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు : డీఈఓ



నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని డీఈఓ యాదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కలమడుగు జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో, పదవ తరగతిలో 9.8 జీపీఏ సాధించిన రఘును, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచి చదువులు చదవడానికి ఉపాధ్యాయుల పాటు తల్లిదండ్రుల, ప్రోత్సాహం ఎంతో అవసరం అన్నారు. అనంతరం మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలలలో కొనసాగుతు అభివృద్ధి పనులను పరిశీలించారు. మండలంలోని జువ్విగూడా, మన్నెగూడ జన్నారంలోని ఎస్సీ కాలనిలో ఉన్న పాఠశాల ఏపీకేగూడా, కొత్తపేట, ఇందన్‌పెల్లి, కలమడుగు, పాఠశాలల పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతన పాటించాలని, కాంట్రాక్టర్లకు సూచించారు. జూన్ మొదటి వారం కల్లా పాఠశాల పనులను పూర్తి చేయాలన్నారు. పనులలో నాణ్యత లోపిస్తే చర్యలు చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి చౌదరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి, పీఆర్ ఏఈ సతీష్, సీఆర్పీలు శేఖర్ శివా దయాకర్, రవి వెంకటేష్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్యన్నా, నరసయ్య, చంద్రశేఖర్, రాజేందర్ పాల్గొన్నారు.

నాణ్యమైన పనిముట్లను అందించాలి



నవతెలంగా-నస్పూర్

గనులలో నాణ్యమైన పనిముట్లను అందించాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా అన్నారు. శుక్రవారం ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్కే న్యూటెక్ గనిలో లైన్‌మెన్లు, కార్మికుల కొరత ఉందని, అదేవిధంగా రూఫ్ బోల్ట్‌లా సమస్య, కోల్ కట్టర్ కార్మికులకు యాజమాన్యం పని ఒత్తిడి పెంచుతుందని, కాలం చెల్లిన ఎస్డీఎల్ యంత్రాలను వాడడం ద్వారా ఆపరేటర్లకు పని భారం పెరుగుతోందని స్పేర్ పార్ట్స్ లా కొరత ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని గని మేనేజర్‌తో కలిసి చర్చించగా వెంటనే పరిష్కారం చేస్తామని గని మేనేజర్ తెలిపినట్లు పేర్కొన్నారు. వేసవికాలం దృష్ట్యా ఉష్ణోగ్రతలు అధికమవుతున్న నేపథ్యంలో ఓపెన్ కాస్ట్, సిహెచ్పిలో పనిచేసే కార్మికుల పని వేళల్లో మార్పు చేయాలని పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన యాజమాన్యం స్పందించకపోవడంతో శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన, సోమవారం అర్ధనగ్న ప్రదర్శన కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏ సంపత్, ఫిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అప్రోజ్ ఖాన్, నాయకులు చంద్రమౌళి, వెంకటేశం, అక్రమ్ పాషా, సకినాల నరసయ్య సంపత్ రావు, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, షాకీర్ పాల్గొన్నారు.

హామీలు మరిచిన కేసీఆర్



నవతెలంగాణ-మంచిర్యాల

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ప్రచారం చేసేందుకు మంచిర్యాలకు వస్తున్న మాజీ సీఎం కేసీఆర్ ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీలు పరచిపోయారని గోదావరి వంతెన సాధన సమితి సభ్యులు ఆరోపించారు. ఆయన పర్యటన సందర్భంగా నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం చేపట్టాలని కోరారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని గోదావరి ఒడ్డున నిర్మించే అంతార్గం బ్రిడ్జి నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన స్థలంలో వారు నిలుచొని నల్ల బ్యాడ్జి లు ధరించి మాట్లాడుతూ కేసీఆర్ చేసిన మోసాన్ని ఎత్తి చూపుతూ నిరసన తెలపాలని అన్నారు. మళ్లీ లోకసభ ఎన్నికల్లో ఓట్లు దండుకోవటానికి మంచిర్యాల కేంద్రానికి వస్తున్నారని ఘాటుగా విమర్శించారు. 2018లో గోదావరి నదిపై అంతర్గం మంచిర్యాల్ కలుపుతూ వంతెన నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చి, రెండుసార్లు అంచనాలను మారుస్తూ పంచవర్ష ప్రణాళిక చేసి బ్రిడ్జి నిర్మాణం చేయడంలో పూర్తిగా బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని, జిల్లాకు అడుగడుగున అన్యాయం చేసిన కేసీఆర్ మరోసారి ఏం మొహం పెట్టుకొని ప్రజల ఓట్లు అడగటానికి వస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గోదావరి వంతెన సాధన సమితి నాయకులు తుల మధుసూదన్ రావు, కలకుంట్ల మల్లయ్య, నల్ల నాగేంద్రప్రసాద్, బానోతు దాస్య, ఐ శివకుమార్, తిరుపతి, మహేందర్ పాల్గొన్నారు.

రజక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బోథ్



బోథ్ పట్టణ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని రజక సంఘం భవనంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘం నాయకులు తెలిపారు. మండల అధ్యక్షుడుగా సిల్కకారు బోజన్న, ఉపాధ్యక్షుడు డాక్టర్ సుమన్ రమేష్, ప్రధాన కార్యదర్శి సిత్కురి రమేష్, సహాయ కార్యద్శిగా సిత్కురి రమా, కోశాధికారి లోస్తం రమేష్, గౌరవ అధ్యక్షుడు సాకేయిపురం రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-తలమడుగు



కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లి(బి), పల్లి(కె), గ్రామాల్లో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, కాంగ్రెస్ రాష్ట్ర ఆదివాసీ వైస్ చైర్మెన్ కుమ్రం కోటేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ఎంపీటీసీ సోమన్న, మాజీ జెడ్పీటీసీ బాబన్న, మాజీ సింగిల్ విండో చైర్మెన్ ప్రకాష్‌రావు, మాజీ సర్పంచ్లు విఠల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్కం సంజు, గంగారెడ్డి, రాజారెడ్డి, లింగారెడ్డి, పోశెట్టి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దనే ఓటింగ్



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా వృద్ధులకు ఇంటింటికి వెళ్లి పోలింగ్ సిబ్బంది వారితో ఓటు వేయించారు. మండలంలో మూడు టీంల ద్వారా పోలింగ్ సిబ్బంది వయో వృద్ధులు ఓటు హక్కు వినియోగించారు. మండలంలోని గ్రామాల్లో వృద్ధులకు పోలింగ్ సిబ్బంది ఓటు వేయించారు.

ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మావల మండలంలోని బట్టిసావర్గాం గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బగూడలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడే నాయకురాలు ఆత్రం సుగుణకు చేతిగుర్తుకు ఓటు వేసి పార్లమెంటుకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ రహీమ్ ఖాన్, కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తడిసేస్ వెంకట్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, కొరటి ప్రభాకర్, అన్నం సంటేన్న, ఎదుల స్వామి, గంగారెడ్డి, నానాజీ, దర్శనాల చంటి, నలిమేల నవీన్‌రెడ్డి, కుదురపాక సురేష్, నాగరాజు, రంజిత్ రెడ్డి, రెండ్ల రాజన్న, వెంకటేష్, మాదేల శ్రీను, ఆలం రూప, అడెల్లు పాల్గొన్నారు.

ఒకసారి అవకాశం ఇవ్వండి : వైఎస్ఆర్‌సీపీ



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో ఇప్పటివరకు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని, తనకు ఒకసారి అవకాశం ఇచ్చి ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి ఎంటో చేసి చూపిస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి చవాన్ సుదర్శన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికీ బోథ్, ఆసిఫాబాద్, ఖానాపూర్, సిర్పూర్, నిర్మల్, ఆదిలాబాద్, ముధోల్ నియోజకవర్గాల్లో ఎన్నో పార్టీలు గెలిచినా, ఇప్పటికీ పలు గ్రామాలకు రోడ్డు సౌకర్యం, కనీసం తాగునీటి సౌకర్యం లేదన్నారు. ఇంకా వైద్యం అందకుండా ఎందరో గర్భిణీ స్త్రీలు రక్తహీనతతో చనిపోవడం ఇంకా బాధాకరమన్నారు. ఇంకా అంబులెన్స్ వెళ్లలేని గ్రామాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. బోథ్‌లో ఇప్పటికీ డిగ్రీ కళాశాల లేదని, ఫైర్ ఇంజన్ లేకపోవడం బాధాకరమన్నారు. నియోజకవర్గ కేంద్రమైన జిల్లా కేంద్రంలో ప్రభుత్వాల నిర్లక్ష్యంతో సీసీఐ ఫ్యాక్టరీ మూతపడటం, స్పిన్నింగ్ మిల్ మూతపడటంతో ఉపాధి కరువైన యువతతో జిల్లా కేంద్రంలో ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఇప్పటికి యువతకు ఉపాధి అవకాశాల కోసం ఇలాంటి పరిశ్రమలను నెలకోల్పోవకపోవడం బాధాకరామన్నారు. మోసపూరిత హామీలతో గెలిచిన వివిధ పార్టీల నాయకులు, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల వల్ల అభివృద్ధి ఇంకా ఆమడ దూరంలో ఉందని, పలు నియోజకవర్గాల్లో ఆనకట్టలు లేక ఎన్నో ఎకరాలు నిరుపయోగంగా ఉండిపోతున్నాయన్నారు. తనకు ఒక అవకాశం ఇచ్చి ఎంపీగా గెలిపిస్తే పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాలలో అన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు.

ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి



• బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

నవతెలంగాణ-కాసిపేట

శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ కోరారు. శుక్రవారం సాయంత్రం బెల్లంపల్లిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు లోక్ సభ ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ తమ ఓటు హక్కుని నిర్భయంగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల దృశ్య శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిపై పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు ఆత్మస్థైర్యంతో తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు ఓటర్లకు భయభ్రాంతులకు గురి చేసిన వారి స్వేచ్ఛకు భంగం కలిగించినా పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా వారి మనోభావాలు దెబ్బ తినే విధంగా వ్యవహరించిన క్రమశిక్షణ చర్యలతో పాటు న్యాయపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. బెల్లంపల్లి పట్టణంలో పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ఇన్స్‌పెక్టర్ రాకేష్ మిశ్రా, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, బెల్లంపల్లి-1 టౌన్ ఎస్ఐ రమేష్, బెల్లంపల్లి 2 టౌన్ ఎస్ఐ డి.రమేష్, తాల్లగురిజాల ఎస్ఐ నరేష్‌లతోపాటు 50 మంది కేంద్ర బలగాలు(బీఎస్ఎఫ్) బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

• ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఇటీవల విడుదల అయిన 10వ తరగతి వార్షిక పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జైనూర్ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులను శుక్రవారం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవితో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక ఫలితాలలో జైనూర్ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులు జాదవ్ శ్రీవేణి (9.7), కుమరం దివ్యవాణి (9.3) జీపీఏ సాధించడం అభినందనీయమని, విద్యార్థులు మంచి మార్కులు సాధించడంలో ఉపాధ్యాయుల విద్యా బోధన, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందని అన్నారు. భవిష్యత్తులో మరింత మంచిగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ శకుంతల, ఏసీఎంఓ ఉద్ధవ్, జైనూర్ ఏటీడీఓ పురుషోత్తం, ప్రధానోపాధ్యాయులు సోనేరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీని ఓడించాలి

• కాంగ్రెస్ అభ్యర్థికి, సీపీఐ మద్దతు
• ఆత్రం సుగుణను గెలిపించాలని పిలుపు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజాస్వామ్యం పరిరక్షించాలంటే బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేణ శంకర్ అన్నారు. శుక్రవారం టీఎన్జీవోస్ భవనంలో సీపీఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. దీనికి ఆయనతో పాటు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఇటీవల మరణించిన ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ రంజన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ మాట్లాడుతూ బీజేపీ తన పదేండ్ల పాలనలో ప్రజలకు చేసేందేమి లేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని ఓడించాల్సిన అవసరముందన్నారు. కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న ఆత్రం సుగుణను భారీ మేజార్టీతో గెలిపించేలా ప్రతి కార్యకర్త పని చేయాలని పులుపునిచ్చారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉదయమే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వచ్చేలా చైతన్య పర్చాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భుజంగ్‌రావు, కౌన్సిలర్ లక్ష్మణ్, సీపీఐ నాయకులు నళినిరెడ్డి, విలాస్, కుంటాల రాములు, అమీన, దేవిదాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వైపే ప్రజల మొగ్గు



• మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో జనం విసుగెత్తి బీఆర్ఎస్ వైపు మొగ్గ చూపుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని యాపల్‌గూడలో పార్టీ ముఖ్యనాయకులతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళనానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి పాల్గొన్నారు. ముందుగా గ్రామానికి వచ్చిన నాయకులకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ గులాబీ జెండా ఎగురుతుందని దీమా వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలను, రైతులను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా విస్మరించాయని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఆ పార్టీలు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ పదేండ్ల పాలనలో ఆదిలాబాద్ అభివృద్ధికి కేంద్రం నుంచి ఎటువంటి సహకారం అందలేదని అన్నారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా నిలబడి అభివృద్ధికి శాయ శక్తులా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగ్రత్ రమేష్, సెవ్వ జగదీష్, జోగు మహేందర్, కుమ్ర రాజు, ఆత్మ చైర్మెన్ జిట్ట రమేష్, గంగయ్య, పరమేశ్వర్, కనక రమణ, సోనేరావు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఐఎన్టీయూసీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తక్కువ మందితో 1947 మే 3న ఆవిర్భావమైన ఐఎన్టీయూసీ నేడు మూడు కోట్ల 50 లక్షల మంది సభ్యత్వంతో కార్మిక హక్కుల కోసం ఉద్యమిస్తుందని ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్ అన్నారు. శుక్రవారం ఐఎన్టీయూసీ ఆవిర్భావాన్ని పురస్కరించుకోని బస్ డిపో ఎదుట సంఘం జెండాను ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి ఆవిష్కరించారు. సంఘానికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్ మాట్లాడుతూ కార్మికుల పక్షాన ఉద్యమించి, ఐఎన్టీయూసీ అనేక విజయాలు సాధించిందని అన్నారు. ఆయా పరిశ్రమలు, సింగరేణిలో కార్మికులకు అండగా ఉండి వారి హక్కులను కాపాడిందన్నారు. 1947 నుంచి ఇప్పటి వరకు అంచలంచలుగా ఎదిగి పెద్ద సంఘంగా రూపొందిందన్నారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ, ఆర్టీసీ నాయకులు ఎల్.రమేష్, కొండూరు రవి, మహేందర్, వీరానంద్ పాల్గొన్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో ఈ నెల 15న బుధవారం జరిగే సర్వసభ్య సమావేశానికి సభ్యులు హాజరుకావాలని ఎంపీడీఓ ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మండల ప్రత్యేక అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని సూచించారు.

అక్రమ మద్యం పట్టివేత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి అక్రమ మద్యం అమ్ముతున్న ఇండియన్ దాబా నిర్వాహకుడు కేంద్రే రజనీకాంత్‌పై కేసును నమోదు చేసినట్టు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. గత రెండు రోజుల నుంచి బెల్టుషాపులపై పోలీసుల దాడులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ దాడులో భాగంగా ఇండియన్ దాబాలో రూ.9020 విలువగల మద్యాన్ని పట్టుకున్నట్టు తెలిపారు.

ఉద్యోగులు ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలి

నవతెలంగాణ-బోథ్



ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏఆర్ఓ కార్యాలయాన్ని సందర్శించారు. అలాగే 2024 ఎన్నికలలో భాగంగా ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకుని పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ తమ సెంటర్ల నుంచి పంపించుకోవాలని సూచించారు. అనంతరం పాట్నాపూర్ గ్రామంలోని హోమ్ ఓటింగ్ వృద్ధుల, వికలాంగుల ఓటింగ్ ప్రక్రియను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో హోమ్ ఓటింగ్ ప్రారంభం

నవతెలంగాణ-బెజ్జూర్

బెజ్జూర్ మండలంలో నలుగురు వృద్దులు శుక్రవారం హోమ్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 85 సంవత్సరాలు దాటిన నలుగురు వద్దులు హెూమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోగా, శుక్రవారం ఎన్నికల అధికారులు వద్దుల ఇండ్లలోకి వెళ్లి ఓటింగ్ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా, బెజ్జూరు మండల కేంద్రానికి చెందిన నాగుల బుచ్చమ్మ, కావిడ గంగుబాయి, అంబగట్టు గ్రామానికి చెందిన ఆత్రం అక్కుబాయి, సీడం ముసలి బాయ్ ఇండ్లలోకి ఎన్నికల అధికారులు వెళ్లి సీక్రెట్ ఓటింగ్ నిర్వహించారు. ఎన్నికల అధికారుల వెంట బెజ్జూర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంతోష్, ఏఎస్ వో రోషిక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ని గెలిపించాలి

నవతెలంగాణ-సిరికొండ

అభివృద్ధి కోసం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపించాలని ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, ప్రజల్లో మంచి ఆదరణ పొందాయన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఏ విధంగా మెజారిటీ ఇచ్చారో, పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేది త్యాగాల పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్, నాయకులు రంజాన్, మాధవ్ పటేల్ ప్రవీణ్, ఇమామ్ పాల్గొన్నారు.